ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.12.02.2025 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అణిచివేయబడిన కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ చెపట్టినట్లు  ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

2. రాష్ట్రంలో బీసీ కులగణన మళ్లీ నిర్వహించి, కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది.

3. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు కుదుర్చుకునేందుకు తమ పార్టీ సిద్ధమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు.

4. ములుగు జిల్లాలో మేడారం చిన్న జాతర ఈరోజు ప్రారంభమైంది.

**దామోదర రాజనర్సింహ**

అణిచివేయబడిన కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వర్గీకరణ అనేది ఏ కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేలకు మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి

సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులు ఈ ఉదయం, హైదరాబాద్‌లో దామోదర రాజనర్సింహాతో సమావేశమయ్యారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను నెరవేరుస్తున్న సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పిటిసి, సంగారెడ్డి

**TALASANI:**

రాష్ట్రంలో బీసీ కులగణన మళ్లీ నిర్వహించి కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ఈరోజు హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం దిగిరాకపోతే భావసారుప్య పక్షాలతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చెప్పినట్టుగా ఉత్తుత్తి హామీలను అంగీకరించేది లేదని, శాసనసభలో చట్టం తేవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసి మేయర్, డిప్యూటి మేయర్ లపై అవిశ్వాస తీర్మానం గురించి పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు వచ్చే వారం కార్పోరేటర్లతో సమావేశమై వ్యూహం నిర్ణయిస్తారని శ్రీనివాస యాదవ్ తెలిపారు.

**PN**

**CPI:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్ట్ పార్టీ పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ తో పొత్తు

కుదుర్చుకునే ఆలోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తమకు బలమున్న చోట పొత్తు కుదరకపోతే స్వతంత్రంగానే అభ్యర్థులను నిలుపుతామని ఈరోజు హైదరాబాద్ లో విలేకరులతో చెప్పారు. ఈ అంశంపై సిపిఐ, ఇతర వామపక్షాలతో కాంగ్రెస్ ఎటువంటి చర్చలు జరపడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు రెఫరెండమేనని కూనంనేని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**PTC, HYD**

**NOTA:**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో ఈరోజు రాష్ట్ర ఎన్నికల కమీషన్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ప్రధానంగా నోటాను చేర్చే విషయంపై చర్చ జరిగింది. కాంగ్రెస్, బిజెపి, తెలంగాణ టిడిపి, జనసేన, సిపి, సిఐ, ఎంఐఎం పాల్గొన్నాయి. ఎన్నికల్లో పోటీలో ఉన్న వారేవరు కాదు అనేది తప్పనిసరి చేయడం, తుది ఓటర్ల జాబితా సమీక్షాపై విస్తృత చర్చ జరిగింది. రాజకీయ పక్షాలు ఈ విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. అయితే పంచాయతీ ఎన్నికలు ఇప్పుడున్న పద్ధతిలోనే జరగాలని కోరాయి.

**PN**

**ఒరిస్సా వైద్య బృందం**

యాదాద్రి భువనగిరి జిల్లా , ఆలేరు లోని ఆరోగ్య కేంద్రాన్ని సుపరిపాలన కేంద్రం ఆధ్వర్యంలో 15 మంది తో కూడిన ఒరిస్సా జాతీయ ఆరోగ్య మిషన్ వైద్య బృందం సందర్శించారు. ఆసుపత్రిలో మౌ లిక సదుపాయాలు , వైద్య సేవల ను

పరిశీలించారు. డయాలసిస్ సెంటర్ లో అందిస్తున్న సేవలు , గర్భిణులకు, తల్లీ, పిల్లలకు 24 గంటలు అందిస్తున్న వైద్య సేవల ను ప్రశంసించారని ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ స్వప్న రాథోడ్ తెలిపారు.

**పిటిసి, యాదాద్రీ**

**TEMPLE:**

హైదరాబాద్ పాతనగరంలో టప్పాచబుత్ర ప్రాంతంలో ఈ ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఒక మతానికి చెందిన ప్రార్ధనా స్థలంలోకి మాంసపు ముద్దను విసిరిన ఘటనతో ఉద్రిక్తత నెలకొంది. ఉదయం వచ్చిన భక్తులు ఇది గమనించడంతో ఒక మతానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేసిన వారిని తక్షణం శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. పోలీస్ సంయుక్త కమిషనర్ విక్రమ్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శాంతియుతంగా మెలగాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**PTC, HYD**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:**

కోళ్ళకు బర్డ్స్ ఫ్లూ పాజిటివ్ ,"ఏవియన్ ఇన్ఫ్లుయెంజా" వైరస్ సోకినట్టు నిర్ధారణ అవడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న కోళ్ల వాహనాలను భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట రవాణాశాఖ చెక్ పోస్ట్ వద్ద రవాణ, పశుసంవర్ధక శాఖల సిబ్బంది అడ్డుకుని తిరిగి ఆంధ్రప్రదేశ్ కు తిప్పి పంపుతున్నారు.

**పిటిసి కొత్తగూడెం**

**IAF:**

సంగారెడ్డి జిల్లాలో ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఫ్లైయింగ్ జోన్ లో జీహెచ్ఎంసి డంప్ యార్డ్ ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలని అకాడమీ ఎరో స్పేస్ భద్రతా విభాగం అధికారి వింగ్ కమాండర్ శుభమ్ మిశ్రా కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతి కి లేఖ రాశారు. డంపింగ్ యార్డ్ ఉపరితలం పైన విమానాలు తిరిగే ప్రాంతమని, అది అక్కడే ఉంటే విమానాలకే కాకుండా మనుషుల ప్రాణాలకు కూడా ముప్పు ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. గుమ్మడిదలకు చెందిన రైతులు ఈ అంశంపై ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు.

**PTC, SR**

**MEDARAM:**

ములుగు జిల్లాలో మేడారం చిన్న జాతర ఈరోజు ప్రారంభమైంది. జాతర కోసం తగిన ఏర్పాట్లు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 5 కోట్ల 30 లక్షల రూపాయలు కేటాయించింది. భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టిసి రెండు వందల ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పలు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఈ జాతరను సందర్శించే అవకాశం ఉంది. జంపన్నవాగులో స్నానాల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

**PTC, MLG**

**నక్ష పథకం – సౌండ్ బైట్**

వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేటలో కేంద్ర ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఏరియల్ భూ సర్వే నిర్వహించారు. నక్ష పథకంలో భాగంగా చిన్న పట్టణాల అభివృద్ధికి నిర్వహిస్తున్న  ఈ భూ సర్వే పై మరిన్ని వివరాలు మా ప్రతినిధి వీణా వాణి అందిస్తారు.

**సౌండ్ బైట్**

పిటిసి, వరంగల్

**ఎగ్జిబిషన్ - కరీంనగర్**

విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళా మేళ,  సైన్స్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ సందర్శించారు. కస్తూరిబా బాలికల పాఠశాల,  వివిధ ప్రభుత్వ పాఠశాలలు ,  గురుకులాల విద్యార్థులు తయారుచేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు.

**పిటిసి, కరీంనగర్**

**PROGRAMME:**

సికింద్రాబాద్ లోని సెంట్ ఆన్స్ హైస్కూల్ లో విద్యార్థులకు పలు అంశాల్లో అవగాహన కలిగించేందుకు ఉత్తర మండలం డీసిపి రష్మి పెరుమాల్ అధ్యక్షతన ఈరోజు ఒక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల

వినియోగం వల్ల అనర్థాలు, స్త్రీ, పురుష సమానత్వం మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**PTC, HYD**

**పొదుపు పథకం - యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లా , భూదా న్ పో చంపల్లిలో నేతన్న పొదుపు పథకానికి ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత , జౌళి శాఖ అధికారి , శ్రీనివాస్ రావు అన్నారు. భూదా న్ పోచంపల్లిలో ఈరోజు చేనేత సహకార సంఘం కార్మికుల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. జియో ట్యాగింగ్ ఉండి, చేనేత వృత్తి చేస్తున్న ప్రతి చేనేత కార్మికుడితో పాటు అనుబంధ కార్మికులు నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పీటీసీ, యాదాద్రి భువనగిరి

**RTC:**

సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టాండ్ నుంచి శంషాబాద్ రాజీవ్ గాంధి అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆర్టీసి ఈరోజు కొత్త పుష్పక్ బస్సులను ప్రారంభించింది. ఈ బస్సులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నాంపల్లి మీదుగా శంషాబాద్ చేరుకుంటాయి. అదే మార్గంలో తిరిగి వస్తాయి. అర్ధరాత్రి 12 గంటల 55 నిమిషాల నుంచి రాత్రి 11 గంటల 55 నిమిషాల వరకు ప్రతి గంటకు బస్సులు నడుస్తాయి.

**PN**